# శ్యామల పెండ్లి

శ్రీమతి మల్లంపల్లి బాలాత్రిపురసుందరమ్మగారు

సాయం సమయము. మలయమారుతము చల్లగా వీస్తోంది. పూదోటలో చలపతి యొక లతాగుల్మందగ్గిర కూచుని ఏదో ఆలోచిస్తూన్నాడు. ఇంతలో వెనుకనుండి ఎవరో కనులు మూశారు. చలపతి చేతులుతడివి 'ఓహో! శ్యామలా! నీవేనా!—దొంగలా కళ్లుమూశావు' అన్నాడు. శ్యామల చేతులుతీసి 'దొంగవి నీవా నేనా? నన్ను తీసుకెళ్లకుండా ఒక్కడవు మద్రాసు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నావు' అంది. 'నిన్ను తీసుకెళ్లడానికి నాకేమి హక్కున్నది' అన్నాడు చలపతి. 'నీ ప్రియురాలిమీద నీకు హక్కులేక మరెవ్వరికుంటుంది?' అని శ్యామల అంది 'నీవు లక్షాధికారుల బిడ్డవు. నేనో భిక్షాధికారిని. ఇట్టిస్థితిలో నీవు నాప్రియురాల వెట్లగుదువు?' అన్నాడు చలపతి. శ్యామల 'తుచ్ఛమగు ధనము నాశించు నీచులట్లు నేను ధనము నాశించుటలేదు. నేను కోరునది పవిత్రప్రేమ' అంది. 'నీ కిష్టమైనచో నీ తలిదండ్రుల కిష్టముకావద్దా' అన్నాడు చలపతి. 'న్యాయసమ్మతమైన విషయమున కింకొకరి యిష్టమేల. నేను—'అని శ్యామల అంటూయుండ ఎవరో పిలచినట్లయింది. శ్యామల యింట్లో కెళ్లిపోయింది. కొంతసేపక్కడనే కూర్చుని తనగదిలోనికి వెళ్లిపోయాడు చలపతి.

చంద్రశేఖరంగారు గొప్ప స్థితిపరుడు. ఆయన కొక శ్యామల తప్ప యితర సంతానమేదియు లేదు. చలపతి చంద్రశేఖరంగారి స్నేహితుని కొడుకు. చిన్నప్పుడే తల్లిదండ్రులు పరలోకగతులైనందున చలపతిని రక్షించువా రెవ్వరును లేరని దయామయుడైన చంద్రశేఖరంగా రా భారమును తన తలపై వహించాడు. అప్పటినుండియు చలపతి చంద్రశేఖరంగారింట్లోనే యుంటున్నాడు. అతని కొక చిన్నయిల్లు కొద్దిఆస్తి ఉండేవి. చంద్రశేఖరంగా రా ఆస్తి నమ్మివేసి చలపతికి చదువు చెప్పిస్తున్నాడు. చిన్నప్పటినుంచి ఇక్కడనే ఉండడంచేత శ్యామల చలపతి దగ్గర చనువుగా ఉంటూoంది. చలపతి స్కూలు నుంచి రాగానే ఇంగ్లీషు పాఠం చెప్పించుకునేది. క్రొత్తవిషయా లేవైన అడుగుతూండేది. చలపతి సంతోషముతో సమాధానములు చెపుతూండేవాడు. దీనితోపాటు వారి హృదయములో ప్రేమ అనే వృక్షము నాటుకుంటూంది. కాని చలపతికిమాత్రం నిరాశగా ఉంటూండేది. ఎందుచేతనంటే శ్యామల గొప్పయింటిబిడ్డ; తనదో బీదస్థితి.

బి. ఏ. పరీక్ష ప్యాసులయి ప్లీడరు పరీక్ష కని మెద్రాసు వెళ్లేడు. శ్యామల కతనిమీద నుండే ప్రేమచేత అతన్ని విడచియుండుట కష్టంగానే యుంది. ఒకనాడు శ్యామలతల్లి యశోదమ్మ చంద్రశేఖరంగారితో 'శ్యామల కింకను పెండ్లిచేయరూ?' అంది.

'శ్యామల పెళ్లా? చెయ్యొచ్చును. తొందరేమిటి'

'దానికిప్పుడు పదహారోపడు. యింకా 'తొందరేమి'టనే అంటారు. ఎక్కడైనా సంబంధంచూసి పెళ్లి చెయ్యాలి యీయేడు.'

'సంబంధం చూడ్డమెందుకు? చలపతి యింకా చదువుకుంటున్నాడు గదా' అని ఊరుకున్నాను. పెళ్లి ఎప్పుడు చేయాలంటే అప్పుడే చేయవచ్చును.'

'చాల్లెండి! ఇన్నాళ్లనుంచి మీరుచూసిన గొప్ప సంబంధంచాలు! సుఖపడుతుంది! ఇంకా ఏ జమీందారుల బిడ్డకో యిస్తారనుకుంటున్నాను కాని యీదరిద్రగొట్టు దామోదరుడికా యివ్వాలనుకుంటున్నారు!! రెక్కాడితే కాని డొక్కాడదు. గొప్ప సంబంధము చేసిన కష్టపడ నక్కరలేకుండ హాయిగా కూచుని తినవచ్చును.'

'ధనముండికూడ దురలవాటులవలన పోగొట్టుకున్నవారు లేరా? చదువువలన ధనము నార్జించి గొప్ప జమీందారులగుచున్నవారు లేరా?'

'తరువాత ఎవరికర్మంవారిది. దానికర్మమే ఆలాగుంటే చదువుకున్న వాడుమాత్రము ధనము నార్జించగలడా? ధనముండియు పోగొట్టుకున్న వా రున్నారుకదా అని చేతులారా దరిద్రుని కంటగట్టడమా? మన కొక్కరితె కూతురు. ఆ ఒక్క కూతురును జమీందారులకిచ్చి ముద్దులు, ముచ్చటలు తీర్చుకుని ఆనందించాలి కాని దరిద్రులకిస్తే ముద్దులు తీరవు.'

ఈ మూర్ఖురాలితో వితండవాద మెందుకని కాబోలు 'నీ యిష్టంవచ్చిన సంబంధం చూచుకో, కాని తెలివి తేటలుగల కుర్రవానిని పోగొట్టుకుంటున్నా'వని అక్కడనుంచి లేచి వీధిలోనికి వెళ్లిపోయారు చంద్రశేఖరంగారు.

చంద్రశేఖరంగారు శ్యామల పెండ్లివిషయములో ఏమీ కలుగజేసుకోవడం మానేశారు. యశోదమ్మ తనసోదరుని సహాయంగా తీసుకొని శ్యామలను ధనికుడైన రామారావుకిచ్చి పెండ్లిచేయడానికి ఏర్పాటుచేయించింది. రామారావు ధనికుడననే గర్వముచేత నిత్యము త్రాగుడు, జూదము, వేశ్యలు మొదలగు దురలవాటులకు లోనై యున్నాడు. శ్యామలయొక్క అందమును ప్రతిరోజున ఆమె బడికిపోవునపుడు చూస్తూ యున్నవా డగుటవలన ఆమెను యిస్తాననడం

తడవుగ నరేసని ఒప్పుకున్నాడు రామా రావు.

శ్యామల పెండ్లి యింక పదిరోజులున్నది. చంద్రశేఖరంగారి బంధుగులంతా ఒక్కొక్కరుగ వచ్చి వారిల్లుచేరుకుంటున్నారు. శ్యామలను పెండ్లికూతురును చేయుదినము వచ్చింది. శ్యామలతల్లి పెండ్లికూతురును చేయుటకై ఆమెగదివద్దకుపోయి 'శ్యామలా! శ్యామలా!' అని పిలిచింది. కాని ఆమెజాడ గానరాలేదు. వెంటనే ఆమె పూదోటలోనికి పోయి వెదకింది. కాని ఆమె కనిపించలేదు. వెంటనే ఆమె చంద్రశేఖరంగారి వద్దకుపోయి 'శ్యామల ఎక్కడకు వెళ్లినదండీ' అని అడిగింది ఆతృతతో. 'ఏమో ఎచటకుపోయినదో, నాకేమీ తెలియదు.' అన్నారు చంద్రశేఖరంగారు. అందరును కలసి ఎచ్చట వెదకినను లాభములేక పోయినది. పెండ్లి వాడావిడిలోనున్న చంద్రశేఖరంగారి యిల్లు విచారంలో మునిగిపోయింది.

ప్రాతఃకాలము. దివాకరుడు తన ప్రతిభను చూపుటకు మీది కెగబ్రాకుచున్నాడు. అట్టితరి తపాలావాడొక కమ్మను చేతబట్టుకొని 'చంద్రశేఖరంగారున్నారా?' యని కేకవేశాడు. ఈజీ చైరులో పడుకొని ఏదియో ఆలోచించుచున్న చంద్రశేఖరంగారా కేక వినగానే అదరిపడి లేచి వచ్చి యాలేఖను దీసికొని చూడగా అందిట్లున్నది.

ప్రియమైన నాన్నగారికి. నేను ఉదయము ఆరున్నరగంటలకు చలపతి బావగారి వద్ద కులాసాగా ప్రవేశించినాను. తమతో చెప్పకుండ యిచటికి వచ్చినందులకు, అమ్మగారి కోరిక విఫలము చేసినందులకు నన్ను మన్నింప వేడుచున్నాను.

మదరాసు ఇట్లు, మీ ప్రియకుమారి,
శ్యామల.

చంద్రశేఖరంగారా లేఖనుచూచి భార్యకు తెలిసినయెడల గొడవగునని తలచి ఆమెకు చూపకయే జేబునం దిడుకొని 'శ్యామలతో సహా బయలుదేరి రావలసిన'దని చలపతికి తంతి నిచ్చిరి. మరునా డుదయమునకు శ్యామలా చలపతులు చంద్రశేఖరంగారింట ప్రవేశించిరి. వారినిద్దరను చూడగనే యశోదమ్మకు కోపము, దుఃఖము ఒక్కసారి పొంగిపోయినవి. ఆమె ఏమియు మాటాడజాలకుండెను. ఊరివారందరు శ్యామలనేర్పునకు మిగుల సంతసించిరి. ఆ మరుసటిరోజుననే శ్యామలా చలపతుల కతి వైభవముతో వివాహము జరిపించారు చంద్రశేఖరంగారు.

రామారావాస్తియంతయు అప్పులవారి స్వాధీనమాయెను. రామారావుకు జైలు ప్రాప్తమయింది. చలపతిరావు ఏలూరులో పేరుమోసిన గొప్ప వకీలు. యశోదమ్మకోపమిప్పటికి చల్లారింది. యశోదమ్మ, చంద్రశేఖరంగార్లు శ్యామలా చలపతులవద్ద సంతోషంతో కాలము గడుపుతున్నారు.